సాక్షి కామారెడ్డి

బుధవారం । 7 । మే । 2025



అన్నదాతపై హమాలీ భారం

అన్నదాతలకు హమాలీ చార్జీలు భారంగా మారుతున్నాయి. సర్కారు చేతులెత్తేయడంతో రైతులకు ఊరట లేకుండా పోయింది.

- 8లో ▸



అప్రమత్తంగా ఉండాలి

పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.8 /18.9

వాతావరణం

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ కామారెడ్డి విద్యార్థే!



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా నియమితులైన ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థి. ఆయన 1982–85 లో ఇక్కడ బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సు చదివారు. కళాశాల అలుమ్నికి పలుమార్లు హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం బోర్గావ్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి.. అప్పట్లో కామారెడ్డిలో స్నేహితులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటూ బీఎస్సీ ఫారెస్ట్రీ పూర్తి చేశారు. కామారెడ్డిలో ఆయనకు చాలా మంది మిత్రులున్నారు. డిగ్రీ పూర్తయ్యాక ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి లైఫ్ సైన్సెస్‌లో పీజీ చేశారు. 1991లో ఐఎఫ్ఎస్ అధికారిగా ఎంపికై వివిధ ప్రాంతాల్లో పనిచేశారు.

‘కొలతల ప్రకారం నిర్మించుకోవాలి’



నిజాంసాగర్: కొలతల ప్రకారంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటేనే బిల్లులు వస్తాయని జెడ్పీ సీఈవో చందర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం జుక్కల్ మండల కేంద్రంతో పాటు బంగారుపల్లె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఇంటి నిర్మాణాలు ప్రారంభించిన వారికి విడతల వారీగా బిల్లులు వస్తాయన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులున్నారు.

వినియోగదారుల ఫోరం జిల్లా ప్రతినిధుల నియామకం



కామారెడ్డి అర్బన్ : వినియోగదారుల ఫోరం జిల్లా కార్యవర్గంలో పలువురికి అవకాశం కల్పించినట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు కుసుమ రమేష్ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా కుంట నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా ఉప్పునూతల రమేష్‌గౌడ్, కార్యదర్శిగా బొల్లి రాజు, సంయుక్త కార్యదర్శిగా బాబు గౌడ్, రాజేశ్ ఖన్నాలను నియమించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఫోరం ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి



తాడ్వాయి : ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా సహకార శాఖ అధికారి రామ్మోహన్, మానిటరింగ్ అధికారి సాయిలు సూచించారు. బ్రాహ్మణపల్లిలోని వరికొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తూకం వేసి, రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. వడ్లు అమ్మిన రైతులకు త్వరగా డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట సొసైటీ డైరెక్టర్ నర్సింలు, కార్యదర్శి నర్సింలు, ఏఈవో హారిక తదితరులున్నారు.

‘ఉత్తీర్ణులయ్యేలా చూడాలి’



గాంధారి : విద్యార్థులందరూ పాస్ అయ్యేలా చూడాలని ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం సూచించారు. ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థుల కోసం గాంధారి కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను మంగళవారం తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం, అధ్యాపకులతో సమావేశమై సబ్జెక్టులవారీగా వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించా రు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించిన అఫిలియేషన్ ప్రతిపాదనలు పంపాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజగోపాల్, లక్ష్మణ్, విజయకుమార్, రమేష్, వెంకటస్వామి, స్వప్న, మమత తదితరులు పాల్గొన్నారు.

బడిలో సెల్‌పై ఆంక్షలు!

- సెల్‌ఫోన్ వాడొద్దంటూ విద్యాశాఖ ఆదేశాలు
- అతిక్రమించేవారిపై చర్యలు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ నిర్ణయం అమలులోకి..
- ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు





బడిలో సెల్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు విధించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వచ్చే విద్యాసంవత్సరంనుంచి ఇది అమలులోకి రానుంది. తరగతి గదిలో సెల్‌ఫోన్ వినియోగించకుండా చూడాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. జిల్లా అధికారులు స్కూళ్లను తనిఖీ చేసి, సెల్‌ఫోన్ వాడే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేసింది. దీంతో ఉపాధ్యాయుల్లో బడిలో సెల్ వాడకంపై చర్చ నడుస్తోంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఉచ్ఛతర ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు అన్నీ కలిపి 1,011 ఉన్నాయి. వాటిలో దాదాపు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. 4 వేల పైచిలుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. చాలామంది ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేస్తూ, తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అయితే కొద్దిమంది మాత్రమే విధులు ఎగ్గొడుతూ యూనియన్ రాజకీయాలు, సొంత వ్యాపారాలతో బిజీగా ఉంటున్నారు. స్కూల్‌కు వచ్చినా నిరంతరం ఫోన్‌లో మునిగితేలుతున్నారు. పేరెంట్స్ స్కూల్‌కు వెళ్లినపుడు కొందరు టీచర్లు సెల్‌ఫోన్ సంభాషణలు, చాటింగ్‌లతో కాలక్షేపం చేస్తుండడాన్ని చూసి తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అలాంటి కొందరి మూలంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం సడలుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు బడిలో సెల్‌ఫోన్ వాడకంపై ఆంక్షలు విధించేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల జరిగిన విద్యాశాఖ అధికారుల సమావేశంలో తరగతి గదిలో ఏ ఉపాధ్యాయుడు కూడా సెల్‌ఫోన్ వాడకూడదంటూ ఆదేశాలు ఇవ్వాలని, ఆకస్మిక తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సెల్ వద్దంటే ఎలా?

బడిలో సెల్‌ఫోన్ వాడొద్దన్న విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలపై ఉపాధ్యాయులు భిన్నంగా స్పందిస్తున్నారు. సెల్‌ఫోన్ వాడకుండా ఉండడమే మంచిదని కొందరు అంటుండగా, మరికొందరు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. కుటుంబ సభ్యుల నుంచి అత్యవసర పరిస్థితుల్లో కాల్ వస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాగే స్కూల్‌లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల హాజరు విషయంలో ఫేస్ రికగ్నైజేషన్‌కు సెల్‌ఫోన్ వాడాల్సి ఉంటుందని, చాలా సమాచారం ఫోన్ల ద్వారానే పంపుతామని పేర్కొంటున్నారు. సెల్‌ఫోన్ వాడద్దంటే ఈ పనులన్నీ ఎలా చేయాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫేస్ రికగ్నైజేషన్, ఆన్‌లైన్ వర్క్స్ కోసం ట్యాబ్‌లు గానీ, ఇతర పరికరాలుగానీ అందిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కొందరి వల్ల చెడ్డపేరు..

ఉపాధ్యాయుల్లో చాలా మంది విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు శ్రమిస్తున్నారు. కొందరైతే ప్రత్యేక తరగతులు కూడా తీసుకోవడం, విద్యార్థులను వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా వారిలోని నైపుణ్యాన్ని వెలికితీస్తూ వారికి వెన్నంటూ నిలుస్తున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరిశోధనల్లో దూసుకుపోతున్నారు. ఆటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సత్తా చాటుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకన్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఆయా రంగాల్లో సక్సెస్ అవుతున్నారు. వారికి గైడ్‌గా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు చేస్తున్న శ్రమ వల్లే విద్యార్థులు రాణిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు చిన్న చిన్న అవసరాలకు సొంతంగా డబ్బులు ఖర్చు చేసేవారు ఉన్నారు. అయితే ఇంత కష్టపడుతున్న ఉపాధ్యాయులు ఒకవైపు ఉంటే, కొందరు మాత్రం బడులకు రాకుండా రాజకీయాలతో కాలక్షేపం చేస్తూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఒకరిద్దరు దుమ్మాల మాస్టర్లు, బిజినెస్ టీచర్ల ధోరణితో మిగతావారికీ చెడ్డపేరు వస్తోంది. ఆ కొందరిపై అధికారుల అజమాయిషీ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందనే భావన అందరిలోనూ ఉంది. అధికారులను మేనేజ్ చేసుకుని బడికి డుమ్మా కొట్టి సొంత వ్యాపకాల్లో మునిగిపోయి కొందరు, బడికి వచ్చినా తమ వ్యాపారాలకు సంబంధించిన వ్యవహారాలపై సెల్‌ఫోన్లలో నిమగ్నమవుతూ మరికొందరు ఉంటున్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ భద్రత వారోత్సవాల్లో కలెక్టర్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్ : విద్యుత్ సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పటి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ప్రాథమిక చికిత్సలు, సీపీఆర్ గురించి వైద్యుడు రమేష్ బాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాబృందం నాటకం ద్వారా వ్యవసాయదారులకు విద్యుత్ సంబంధిత ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించింది. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ (టెక్నికల్, భద్రత అధికారి) ప్రభాకర్, డీఈ(ఆపరేషన్) కల్యాణ చక్రవర్తి, డీఈ(ఎంఆర్‌టీ) నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలకు సిఫారసు చేయాలి

లింగంపేట: భూభారతి చట్టం ప్రకారం భూముల వివరాలు సేకరించి ఎలాంటి సమస్యలకు తావులేకుండా ఉన్నట్లయితే పట్టాలకు సిఫారసు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ముంబోజీపేట, నల్లమడుగు గ్రామాలకు చెందిన రైతులు రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన దరఖాస్తులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న రైతుల సంఖ్య, ఎన్నేళ్ల నుంచి సాగులో ఉన్నారు అన్న వివరాలను తెలుసుకున్నారు. సదరు భూములు అటవీ ప్రాంతమా లేక పట్టా భూములా అని అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం భవానీపేటలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్ల వివరాలు, రైతులకు కల్పించిన వసతుల గురించి తెలుసుకున్నారు. ధాన్యం తూకాలను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ముంబోజీపేటలో భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

ప్రకృతి వనం.. ఆహ్లాదానికి దూరం

పట్టించుకునేవారు లేక ఆనవాళ్లు కోల్పోయిన వైనం



కళావిహీనంగా ఉన్న 12వ వార్డు ప్రకృతి వనం

ఎల్లారెడ్డి: ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు పట్టించుకునేవారు లేక ఆనవాళ్లు కోల్పోతున్నాయి. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలలో పల్లె ప్రకృతి వనాలు, మూడు బల్దియాలలో పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు ఉపాధి హామీ నిధుల నుంచి ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 6 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. వీటితో ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి, రక్షణ కోసం కంచెలు, పార్కులో కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసి పార్క్ నిర్వహణ కోసం సిబ్బందిని నియమించారు. పట్టణాలలో వార్డుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. ప్రజలు సైతం పలుచోట్ల స్వచ్ఛందంగా ముందుకువచ్చి స్థలాలు, బెంచీలు ఇతర సామగ్రి సమకూర్చారు. ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు ఎండిపోతే కొత్తవి నాటాల్సి ఉంటుంది. అయితే ఏర్పాటు చేసిన కొన్నాళ్లకే వీటిని నిర్లక్ష్యం చేయడం ప్రారంభించారు. పంచాయతీలు, మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం పూర్తయ్యాక వాటిని పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో చాలాచోట్ల ప్రకృతి వనాలు అస్థిత్వాన్ని కోల్పోయాయి. మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారిపోయాయి. పూలు, అలంకార మొక్కలు, ఆహ్లాదాన్ని పంచే వృక్షాలతో కళకళలాడాల్సిన పల్లెప్రకృతి వనాలు ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యి ప్రజలకు ఆహ్లాదం కరువయ్యింది.

మొక్కలు ఎండకుండా చూస్తాం

ఎల్లారెడ్డి పట్టణంలోని 12 వార్డులలో ఉన్న పట్టణ ప్రకృతి వనాలలో మొక్కలు ఎండకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. ఎండిన మొక్కల చోట కొత్త మొక్కలను నాటుతాం.

– మహేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి 11వ వార్డులో పడిపోయిన పట్టణ ప్రకృతి వనం గేటు

‘ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి’



బాన్సువాడలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

బాన్సువాడ రూరల్ : ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పోలీస్ సేవలు ఉండాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. మంగళవారం ఆయన బాన్సువాడ, బీర్కూర్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. రికార్డులతోపాటు పలు విభాగాలను పరిశీలించారు. రోజూ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఆధారంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్య ఇవ్వాలన్నారు. డయల్ 100 కాల్స్‌కు బ్లూకోల్ట్స్ సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్, సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలపై రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని సూచించారు. గ్రామ పోలీసు అధికారి తరచూ తమ గ్రామాలను సందర్శించి ప్రజలను చైతన్య పర్చాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం మేర మొక్కలు సిద్ధం



నర్సరీని పరిశీలిస్తున్న ఈజీఎస్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్: ప్రతి పంచాయతీ పరిధిలో లక్ష్యం మేర మొక్కలను సిద్ధం చేస్తున్నామని ఈజీఎస్ ఏపీడీ వామన్‌రావు పేర్కొన్నారు. లక్ష్యంపై నిర్లక్ష్యం శీర్షికన మంగళవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. మంగళవారం ఆయన ప్లాంటేషన్ మేనేజర్ సురేందర్‌తో కలిసి తెల్లాపూర్‌లోని వన నర్సరీని సందర్శించారు. వన నర్సరీలో 4 వేల మొక్కల పెంపకం లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. మొక్కల సంరక్షణను వన సేవకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలని సూచించారు. వారి వెంట ఈజీఎస్ ఏపీవో శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ బాల్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి గంగారాం, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ తదితరులు ఉన్నారు.

తొమ్మిదేళ్లుగా శతశాతం ఉత్తీర్ణత

- ఈ ఏడాది పదో తరగతిలో 17 మందికి 500లకుపైగా మార్కులు
- ఆదర్శంగా నిలుస్తున్న మాందాపూర్ సర్కారు బడి



మాందాపూర్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

బీబీపేట : ఉత్తీర్ణులవడమే కాదు.. మంచి మార్కులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఈ పాఠశాల వరుసగా తొమ్మిదోసారి పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతను నమోదు చేసింది. ఈసారి 36 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు. ఇందులో 17 మంది 500 మార్కులపైన సాధించడం గమనార్హం. తమ పాఠశాల విద్యార్థులు 2017 సంవత్సరం నుంచి వందశాతం పాసవుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఎంతోమంది ఐఐఐటీకి ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం..

ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. ఉపాధ్యాయులు రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకే పదో తరగతి విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయి. ప్రత్యేక తరగతులు నిర్వహించే సమయంలో రాత్రి 9 గంటల వరకు విద్యార్థులతో చదివిస్తారు. రోజూ ఇద్దరు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తారు. దీంతో విద్యార్థులంతా ఉత్తీర్ణులవడమే కాకుండా మంచి మార్కులు సాధించగలుగుతున్నారు.


ప్రోత్సహించారు



ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారు. టీచర్లు ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. దీంతో పదోతరగతిలో 568 మార్కులు వచ్చాయి. బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకుంటాను.

– శ్రీనిధి, విద్యార్థి, మాందాపూర్

కష్టపడి చదివాం



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చాలా కష్టపడ్డాం. ప్రత్యేక తరగతులను రోజూ హాజరయ్యాం. ఉపాధ్యాయుల సూచనలు పాటించాం. అందరం పాసైనందుకు సంతోషంగా ఉంది.

–నిక్షిత, విద్యార్థి, మాందాపూర్

సమష్టి కృషితో..



విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నాం. దీంతో విద్యార్థులందరికీ మంచి మార్కులు వస్తున్నాయి. ఇది ఉపాధ్యాయుల సమష్టి కృషి ఫలితం. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం సైతం మరువలేనిది.

– సాయిలు, హెచ్ఎం, మాందాపూర్

తెలుగును ప్రథమ భాషగా అమలు చేయాలి

- తెరవే రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి

కామారెడ్డి అర్బన్ : డిగ్రీ వరకు తెలుగును ప్రథమ భాషగా అమలు చేయాలని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కళాశాలలో మంగళవారం తెరవే రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ తెరవే ఆవిర్భవించి 25 ఏళ్లవుతున్న సందర్భంగా అక్టోబర్‌లో రజతోత్సవాలు నిర్వహించడంతోపాటు ప్రత్యేక సంచిక తీసుకువస్తామన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి ఆదివాసీల హక్కులను రక్షించాలని, అకాల వానలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వనరుల విధ్వంసాన్ని అరికట్టాలని తీర్మానించారు. రజతోత్సవ తెరవే చరిత్ర సంచిక సంపాదకులుగా గాజోజు నాగభూషణం, సభ్యులుగా పర్కపెల్లి యాదగిరి, ఆడెపు లక్ష్మణ్‌లను నియమించారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గాజోజు నాగభూషణం, రాష్ట్ర, ఆయా జిల్లాల ప్రతినిధులు ఉదారి నారాయణ, నగునూరి శేఖర్, సూరారం శంకర్, కూకట్ల తిరుపతి, ఆడెపు లక్ష్మణ్, గఫూర్ శిక్షక్, తప్పెట ఓదయ్య, వెంగలి నాగరాజు, చౌడబోయిన తిరుపతి, నారాయణ గౌడ్, కర్షక్ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ ఎంఏ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండి మల్లారెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు

క్లుప్తంగా

40 ఏళ్ల తర్వాత ఒక్కచోటికి..



దోమకొండలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. 1984–85 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి విద్యార్థులు దాదాపు 40 సంవత్సరాల తర్వాత 45 మంది పూర్వ విద్యార్థులు కలుసుకుని వారి బాగోగులు మాట్లాడుకున్నారు. వారి వ్యక్తిగత వృత్తి వివరాలు, పిల్లల వివరాలు చేస్తున్న ఉద్యోగాలు తదితర విషయాలపై పరిచయం చేసుకున్నారు. మరణించిన తమ తోటి పూర్వ విద్యార్థుల మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాపురెడ్డి, శ్రీనివాస్‌శర్మ, రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధరామేశ్వర్‌రెడ్డి, నర్సింలు, నాగరాజు పాల్గొన్నారు.

నేహాశెట్టి సందడి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలో మంగళవారం డీజే టిల్లు సినిమా ఫేమ్ నేహా శెట్టి సందడి చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఎల్‌వీఆర్ షాపింగ్ మాల్‌ను మంగళవారం సినీనటి నేహాశెట్టి, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా నేహాశెట్టితో సెల్ఫీలు తీసుకోవడానికి అభిమానులు ఎగబడ్డారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు పండిత్ పవన్, ఎల్‌వీఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసునంటూ బెదిరించి నగదు అపహరణ

నవీపేట: నవీపేట శివారులో ఓ వ్యక్తి పోలీసునంటూ బెదిరించి, ఒకరి వద్ద నగదు అపహరించాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మద్దెపల్లికి చెందిన యడ్ కిషన్ ఈనెల 5న నవీపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. నవీపేట శివారులో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి కిషన్ వాహనాన్ని ఆపాడు. పోలీసునంటూ బెదిరించి కిషన్ జేబులోని రూ.10500ల నగదుతోపాటు అన్ని కార్డులను బలవంతంగా లాక్కొని, పోలీస్ స్టేషన్‌కు రమ్మని పారిపోయాడు. అతని ఆచూకీ కోసం ఆరా తీయగా పోలీసు కాదని తెలుసుకున్నాడు. అతడిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అన్నదాతపై హమాలీ భారం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- క్వింటాల్‌కు రూ.50 వరకు వసూలు
- ప్రభుత్వమే చెల్లించాలని కోరుతున్న రైతులు



బీర్కూర్‌లో ధాన్యం తూకం చేస్తున్న హమాలీలు

బాన్సువాడ : ఆరుగాలం శ్రమించి పండించిన ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే హమాలీ లోడింగ్ ఖర్చు రైతులకు తడిసి మోపెడవుతుంది. కొన్ని గ్రామాల్లోని కేంద్రాల్లో హమాలీలకు ఒక్కో బస్తాకు (40 కిలోలు) రూ. 15 నుంచి రూ. 20 రైతులు ఇస్తుండగా మరి కొన్ని ప్రాంతాల్లో క్వింటాల్‌కు రూ.50 నుంచి రూ.60 ఇస్తున్నారు. గతంలో హమాలీ చార్జి ప్రభుత్వమే చెల్లించేది. దీంతో అన్నదాతపై కొంత భారం తగ్గేది. కానీ 2017 రబీ సీజన్ నుంచి ప్రభుత్వం చేతులెత్తేసింది. మద్దతు ధర క్వింటాల్‌కు గ్రేడ్ ఏ రూ. 2320, కామన్ రకం రూ.2300 చెల్లిస్తున్నారు. ఇందులో హమాలీలకు, సుతీలు, లారీలకు కలిపి రూ.50 రైతులే చెల్లిస్తున్నారు. కానీ లారీ యజమానులకు గిట్టుబాటు కాకపోవడంతో రైతుల వద్ద అదనంగా సంచికి రూ. 2 చొప్పున తీసుకుంటున్నారు.

ఊపందుకున్న కొనుగోళ్లు..

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ఊపందుకున్నాయి. సహకార సంఘాల ఆధ్వర్యంలో 263 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే, ఐకేపీ ఆధ్వర్యంలో 183 కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ యాసంగిలో నాట్లు వేసిన వారం నుంచే మొగిపురుగు ఆశించి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. పంటు కాపాడుకునేందుకు రసాయన మందులు వాడారు. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టగా దిగుబడి అంతంతే వస్తుందని రైతులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల ద్వారా ఇప్పటి వరకు 3.17 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు.

చేతులెత్తేసిన ప్రభుత్వం

గతంలో క్వింటాలుకు రూ.5.30 చొప్పున ప్రభుత్వం హమాలీలకు చెల్లించేది. మిగిలిన డబ్బులు రైతులు కలుపుకుని ఇచ్చేవారు. దీంతో అన్నదాతలకు కొంత ఊరట లభించేది. 2017 నుంచి ప్రభుత్వం చేతులెత్తేయగా, అప్పటి నుంచి రైతులపై భారం పడుతోంది. హమాలీలు ధాన్యం ఎత్తడం, తూకం వేయడం చేయాలి. పెరిగిన పెట్టుబడులకు మద్దతు ధర సరిపోతలేదని రైతులు వాపోతున్నారు.హమాలీ చార్జీలు పూర్తిగా ప్రభుత్వమే భరించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

భారం తగ్గుతుంది

ఐదెకరాల్లో సన్నరకం వరి సాగు చేసి వారం రోజుల క్రితం పంటను కోశాం. వాతావరణ మార్పులు, తెగుళ్లతో ఈ సారి ఆశించిన దిగుబడి వచ్చేలా కనిపిస్తలేదు. ఎకరాకు రూ. 25 వేల పెట్టుబడి పెట్టాను. హమాలీలకు ప్రభుత్వం చెల్లిస్తే కొంత భారం తగ్గుతుంది.

–నారాయణ రైతు,బాన్సువాడ.

భవిష్యత్తులో జమ అవుతాయి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో ప్రస్తుతం మద్దతు ధర జమ అవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేయగానే భవిష్యత్‌లో హమాలీ చార్జీలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. జూన్ 10 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయి.

– రామ్మోహన్‌రావు, డీసీవో, కామారెడ్డి

కాలభైరవుడికి 108 స్వీట్లతో నైవేద్యం

- భైరవ నామస్మరణతో మార్మోగిన రామారెడ్డి
- భారీగా తరలివచ్చిన భక్తులు



కాలభైరవుడికి సమర్పించిన 108 రకాల స్వీట్లు

రామారెడ్డి: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీ కాలభైరవుడి ఆలయంలో వైశాఖమాస రెండో మంగళవారం పురస్కరించుకొని స్వామివారికి 108 రకాల స్వీట్లతో నైవేద్యం సమర్పించారు. ఈసందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారికి అలంకరించే కరెన్సీ దండకు భక్తులు భారీగా విరాళాలు సమర్పించారు. మూడో మంగళవారం 108 రకాల కూరగాయలతో, నాలుగో మంగళవారం 108 రకాల పూలతో కాలభైరవుడిని అలంకరిస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎండ వేడిమి తట్టుకునేందుకు టెంట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకులు రాచర్ల శ్రీనివాసశర్మ, వంశీకృష్ణశర్మ, జూనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్, నాగరాజ్, మాజీ చైర్మన్ గంజి సతీష్‌గుప్తా పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



పాల్కంపేటలో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి



రాంపూర్ తండాలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో దత్తేశ్వరి

లింగంపేట/తాడ్వాయి/ రాజంపేట/బాన్సువాడ రూరల్ : ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని వ్యవసాయాధికారులు తెలిపారు. లింగంపేట మండలం పాల్కంపేట, బాయంపల్లి గ్రామాల్లో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు.తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ రైతు వేదిక కార్యాలయంలో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్‌లపై మండల వ్యవసాయాధికారి నర్సింలు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజంపేట మండలంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన కల్పించినట్లు కామారెడ్డి డివిజనల్ వ్యవసాయ సంచాలకులు అపర్ణ తెలిపారు. బాన్సువాడ మండలం రాంపూర్ తండాలో ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేపట్టినట్లు క్లస్టర్ ఏఈవో దత్తేశ్వరి తెలిపారు. ప్రతి రైతు తనకున్న భూములకు సంబంధించిన వివరాల సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ ఉంటుందని, దీనికి రైతులందరూ ఆధార్ లింకు ఉన్న సెల్ ఫోన్, ఆధార్ కార్డ్, పట్టా పాస్ బుక్ తెచ్చుకొని తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని కామారెడ్డి డివిజనల్ వ్యవసాయ సంచాలకులు అపర్ణ సూచించారు.ఈకార్యక్రమంలో ఏఈవోలు, ఏవోలు, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



బిచ్కుంద మసీద్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై మోహన్‌రెడ్డి

బిచ్కుంద(జుక్కల్) : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్సై మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బిచ్కుంద ఆబెదీన్ మసీద్‌లో ముస్లింలతో సమావేశమై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులు పక్కనే ఉన్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడవచ్చని సూచించారు. సీసీ కెమెరాలు బిగించుకుంటే రక్షణగా ఉంటాయని వివరించారు. మండలంలోని అన్ని మసీదులు, దర్గాలలో తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం



బాన్సువాడ నర్సింగ్ కళాశాలలో..

కామారెడ్డి టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాబృందం ప్రతినిధి ప్రభాకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సెట్విన్ వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు షీటీం, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సంప్రదించాలన్నారు. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే షీ టీంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో షీ టీం, భరోసా సిబ్బంది, కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో 100 డయల్ చేయాలి

బాన్సువాడ : అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు 100 డయల్ చేయాలని షీటీం సభ్యులు అనిల్, ప్రియాంకలు సూచించారు. మంగళవారం బాన్సువాడ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాలపై, టీ–సేఫ్ యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోకిరిలబెడదఉన్నప్పుడువెంటనే 8712686094కు సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాలలో తరచుగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సంతోష్ కుమార్ అన్నారు.మండల కేంద్రంలో మంగళవారం పోలీసుల కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలతో పాటు పలుఅంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దని, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ రాజయ్య,కళాబృందం ప్రతినిధులు ప్రభాకర్, పోలీసు సిబ్బంది, కళాకారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రామారెడ్డిలో సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న యువజన క్రీడాధికారి జగన్నాథం

రామారెడ్డి : జిల్లా యువజన క్రీడశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాధికారి జగన్నాథం పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన రామారెడ్డిలో సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ ...జిల్లాలో 10 సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని, రామారెడ్డిలో పుట్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించామన్నారు. 34 మంది బాలబాలికలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. క్యాంప్‌ను సద్వినియోగం చేసుకొని జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సంజయ్ కుమార్, తహసీల్దార్, ఉమలత, ఎంపీడీవో తిరుపతి రెడ్డి ఎంఈవో ఆనంద్ రావు, కార్యదర్శి క్రాంతి కుమార్, సమ్మర్ కోచింగ్ నిర్వాహకులు బాలరాజు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



బాలవ్వ (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు పుల్లూరి బాలవ్వ (101) సోమవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. మృతురాలికి 25మంది కూతుర్లు, మనమండ్లు, మనుమరాళ్లు ఉన్నారన్నారు. బాలవ్వ అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృత్యువాత

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని చెరువులో ఓ వ్యక్తి పడి మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన తోడెటి నర్సింహులు(35) ఆలూర్ గ్రామంలో మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగ గత కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై పనివెళ్లకుండా తిరుగుతున్నాడు. సోమవారం ఉదయం పనికి వెళుతున్న అని చెప్పి బయటకు వెళ్లిన నర్సింహులు తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం చెరువులో శవమై కనిపించాడు. మద్యం మత్తులో చెరువులో పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామ పెద్ద చెరువులో మెండె సాయమ్మ (59) అనే మహిళా చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు. చెరువులో మహిళ మృతదేహం తేలినట్లు స్థానికులు మంగళవారం సమాచారం అందించడంతో ఎస్సై ఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎస్సారెస్పీలో ఒకరి ఆత్మహత్య

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ వివరాలు ఇలా.. మండలంలోని నల్లూర్ గ్రామానికి చెందిన అటాక్ బాలకృష్ణ(21)కు గత కొంతకాలంగా పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరడం లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం ప్రాజెక్ట్ వద్దమృత దేహం తేలడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా బాలకృష్ణ మృతదేహంగా గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ వద్దగల పర్మిట్ గదిలో పేకాట స్థావరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేసి, పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు. రూ.6450 నగదు, నాలుగు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామ శివారులోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు కొడిచర్ల శివారులో పోలీసులు నిఘా వేశారు. దీంతో రెండు ట్రాక్టర్లను పట్టుకొని కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ఇందల్వాయి మండలంలో..

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన సాయికుమార్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్‌షాక్‌తో ఓ గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన రైతు పొగాకు రమేష్‌కు చెందిన గేదె పొలం వద్ద మేత మేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో రైతు రమేష్‌కు దాదాపు రూ.65వేల నష్టం జరిగినట్లు వివరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత చెందారు. ఆటో అదుపుతప్పి నందిపేట మండలంలో ఓ వృద్ధుడు, బైక్ అదుపుతప్పి పిట్లం మండలంలో ఓ యువకుడు, డొంకేశ్వర్ మండలంలో ఒకరు చనిపోయారు. వర్ని మండలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు.



మృతిచెందిన గోక సాయన్న

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో ఆటో బోల్తా పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన గోక అశోక్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయానికి మొక్కు తీర్చుకోవడానికి వచ్చాడు. దర్శనం చేసుకున్న అనంతరం తిరిగి ఇంటికి బయలుదేరగా ఎల్లమ్మ గుట్ట పైనుంచి ఆటో కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో ప్రయాణిస్తున్న గోక సాయన్న (65), మమత, నితిన్, లక్ష్మిప్రసన్నలకు గాయాలు కాగా వారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోక సాయన్న మృతి చెందాడు. మృతుడి కొడుకు గోక అశోక్ ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ గట్టు సత్యనారాయణపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

పిట్లం మండలంలో..



మృతి చెందిన యాదగిరి

పిట్లం(జుక్కల్): బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని పిట్లం–బాన్సువాడ రహదారిపై చోటు చేసుకుంది. పిట్లం ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మానూర్ గ్రామానికి చెందిన సొదర్పల్లి యాదగిరి (34) తన బైక్‌పై సోమవారం రాత్రి అంకోల్ తండా నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో యాదగిరి కింద మీద పడి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడి తల్లి విట్టవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వర్ని మండలంలో..

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవూరు–చందూరు గ్రామాల మధ్య సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగారాం (60) అక్కడికక్కడే మృతి చెందినట్లు వర్ని మహేష్ వెల్లడించారు. రోడ్డుపై వెళ్తున్న గంగారాంను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

డొంకేశ్వర్ మండలంలో..



పోశన్న (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని అన్నారం మాజీ గ్రామ సర్పంచ్ మంగ్లారం పోశన్న (47) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నికాల్‌పూర్‌లో సోమవారం జరిగిన బంధువుల ఫంక్షన్‌కు పోశన్న వెళ్లాడు. రాత్రి స్కూటీపై తిరిగి ఇంటికి బయలుదేరాడు. అన్నారం గ్రామ శివారులోకి రాగానే మూల మలుపు వద్ద స్కూటీ అదుపుతప్పడంతో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో జరగనున్నాయి.

బోరుబండి సీజ్



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముంబోజిపేట తండా శివారులోగల అటవీ ప్రాంతంలో బోరు తవ్వుతున్న బోరుబండిని సీజ్ చేసినట్లు ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ అధికారి ఓంకార్ మంగళవారం తెలిపారు. ముంబోజిపేట తండా శివారులోని 701 కంపార్టుమెంటులో మంజ వెంకట్రాం అనే రైతు బోరు వేస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి బోరుబండిని సీజ్ చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో బోరు వేయిస్తున్న రైతు వెంకట్రాం, బోరుబండి యజమాని కిష్టాపురం గోపాల్‌రెడ్డి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్):మండలంలోని ముదక్‌పల్లిలోగల సూదులమ్మ ఆలయం, మంచిప్ప శివారులోని గండిమైసమ్మ ఆలయాల్లో చోరీ జరిగింది. ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. సూదులమ్మ ఆలయ గేటుకు వేసిన తాళం, హుండీని సోమవారం అర్ధరాత్రి నిందితుడు పగులగొట్టారు. హుండీలో ఉన్న సుమారు రూ.వెయ్యి వరకు నగదును ఎత్తుకెళ్లాడు. ఆలయ గేటు వద్ద ఉన్న సీసీ కెమెరాను ధ్వంసం చేశాడు. మంగళవారం ఉదయం ఆలయ సిబ్బంది చోరీని గుర్తించి పోలీసులు, గ్రామపెద్దలకు సమాచారమిచ్చారు. పోలీసులు, క్లూస్‌టీమ్ సిబ్బంది వచ్చి ఆధారాలు సేకరించారు. అలాగే ఆలయం బయట నిందితుడు దొంగిలించిన బైక్, తాళం పగులగొట్టేందుకు వాడిన పారను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గండి మైసమ్మ ఆలయంలో..

మంచిప్ప శివారులోని గండి మైసమ్మ ఆలయ హుండీని దుండగుడు సోమవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లాడు. హుండీలో రూ.400 వరకు నగదు చోరీకి గురైనట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. కాగా రెండు ఆలయాల్లో చోరీకి పాల్పడిన నిందితుడిని ముదక్‌పల్లి గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. చోరీ విషయమై నిందితుడిని విచారణ చేపట్టి, వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో సిబ్బంది ఇటీవల నగరంలో డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. దీంతో మద్యం తాగి వాహనాలు నడుపుతూ సుమారు 25 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వారికి సంబంధింత పోలీస్ స్టేషన్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి, మంగళవారం జిల్లా కోర్టులో హాజరుపర్చారు. జడ్జి వారిలో ఐదుగిరికి రెండు రోజుల జైలు శిక్ష, మిగిలిన 20 మందికి జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో..

జక్రాన్‌పల్లి: మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా పడకల్ గ్రామానికి చెందిన అప్పాల వినోద్ మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో అతడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఆర్మూర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు.